కాలనీ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే


ప్రశాంత్‌నగర్‌లో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రశాంత్‌నగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో నూతనంగా భూగర్భ డ్రైనేజీ పనుల నిర్మాణం చేపట్టాలని, పార్కులలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని, అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించాలని, కుంగిపోయిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కాలనీవాసులు తెలిపిన అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు చింతల రవికుమార్, లగ్గోని శ్రీధర్‌గౌడ్, ఖైసర్, వేముల య్యగౌడ్, పీవీఎస్ రావు, సంతోష్, కాలనీ నాయకులు యుగంధర్‌రెడ్డి, బాలాజీనాథ్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి నూతన కమిటీని ఎన్నుకోలేదు


సమావేశంలో మాట్లాడుతున్న మంకాల శేఖర్‌రెడ్డి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘానికి నూతన కమిటీని ఏర్పాటు చేయలేదని, సంఘం అధ్యక్షుడిగా తానే కొనసాగుతున్నానని మంకాల శేఖర్‌రెడ్డి వెల్లడించారు. కాలనీలో మంగళవారం ఆయన కాలనీ ప్రతినిధులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, కొంత మంది తాము నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నామని తప్పుడు ప్రచారం చేయడంతో పాటు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి కాలనీవాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. తమ కాలనీలో ఇప్పటివరకు కొత్తకమిటీని ఏర్పాటు చేయలేదన్నారు. త్వరలోనే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేసుకుంటామని, అప్పటి వరకు తానే అధ్యక్షుడిగా కొనసాగుతానని స్పష్టం చేశారు. సమావేశంలో కాలనీ ప్రధాన కార్యదర్శి ఐలేష్‌గౌడ్, ప్రతినిధులు మంద ప్రవీణ్‌రెడ్డి, కొండకింది వెంకట్‌రెడ్డి, మంద శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, కె.చిన్నపరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజకవర్గం ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అక్బర్ బాగ్‌లోని ఆఫీసర్స్ మెస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఓవర్సీస్ జాబ్ ఫైయిర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి అర్హతను బట్టి ఐటీసీ వారు 60 రోజులు ఉచితంగా మల్టీ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం ఓవర్సీస్ మేన్‌పవర్ కంపెనీ సహకారంతో విదేశాలలో ఉపాధి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో అక్బర్‌బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, చవుని కార్పొరేటర్ సలామ్ షాహిద్, ఎంఐఎం నాయకులు సైపుద్దీన్ షఫీ, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



ట్రాఫిక్ రూల్స్‌పై ప్రదర్శన నిర్వహిస్తున్న మలక్‌పేట ఈస్ట్‌జోన్ ఆర్టీఏ అధికారులు, సిబ్బంది

మలక్‌పేట: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మలక్‌పేట ఈస్ట్‌జోన్ ఆర్టీఓ సుభాష్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్ వాహనదారులకు అవగాహన కల్పించారు. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆర్టీఏ అధికారులు, సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు గులాబీ పువ్వులు ఇచ్చి హెల్మెట్, సీట్ బెల్ట్‌ధారణ ప్రాముఖ్యతను వివరించారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు అనుసరించి నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఐలు రమేష్ బాబు, అరుణ, ఉమ, నరేంద్రపాల్ సింగ్, ఏఎంవీఐలు రజనీ, సైదా, ఏఓలు విజయ్‌కుమార్, ప్రవీణ్, మధుకర్, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగం చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


నిబంధనలు పాటించని వాహనదారుడికి గులాబీ ఇస్తున్న ఎంవీఐ రమేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో...


హెల్మెట్ ధరించిన వారిని సన్మానిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ నాయక్

సైదాబాద్: రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు . హెల్మెట్ పెట్టుకొని ప్రయాణిస్తున్న వాహనదారులకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ నాయక్ పూలమాలలు వేసి సత్కరించారు. హెల్మెట్ లేకుండా వెళ్తున్న వాహనదారులను ఆపి వారికి హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేశారు. వారితో హెల్మెట్ ధరింపజేసి సన్మానించారు. ఇక నుంచి హెల్మెట్ పెట్టుకునే ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ ఎస్ఐలు వెంకటప్ప, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పద్యనాటకాలు


సత్యహరిశ్చంద్రీయం నాటకంలోని ఓ దృశ్యం

నాగోలు: తెలుగు నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్రీయం నాటక ప్రదర్శనలు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నాగోలు కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ప్రజల్లో విశేష ఆదరణ పొందిన ఈ మహత్తర పద్యనాటకాల ప్రదర్శనలో పాత్రధారులు తమ పాత్రల్లో పూర్తిగా నిమగ్నమై తమ నటనా చాతుర్యంతో రక్తికట్టించారు. కార్యక్రమంలో విజయశ్రీ కాలనీ ప్రధాన కార్యదర్శి ఎం, రాజేష్, న్యాయవాది శ్రీనివాస్‌రావు, సంస్థ కార్యదర్శి డాక్టర్ వెంకటాచార్యులు, కాలనీ వాసులు శరత్‌రెడ్డి, అశోక్‌కుమార్, సినీనటి శ్రీమణి, బుల్లితెర నటులు పల్లవి, జ్యోతి, మనుప్రియాలను సన్మానించారు.

కేసీఆర్ కుట్ర మరోసారి బహిర్గతమైంది: పల్లె వినయ్

నాగోలు: తెలంగాణ ఉద్యమ నేత కోదండరాంపై కేసీఆర్ కుట్ర మరోసారి బహిరంగమైందని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ అన్నారు. ముందస్తు ప్రణాళికతోనే కోదండరాం ప్రమాణస్వీకారాన్ని వాయిదా వేయించేందుకు కోర్టులో కేసు వేశారని అన్నారు. ఉద్యమ నాయకుడు చట్టసభల్లోకి వస్తున్నాడంటేనే కేసీఆర్ వణికిపోతున్నాడని అన్నారు. గత ప్రభుత్వ అవినీతిని చట్టసభల్లో నిలదీస్తారనే భయంతోనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు పెట్టి ప్రొ.కోదండరాంను ఓడించారని, ఇప్పుడేమో కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారని వినయ్ కుమార్ ఆరోపించారు. కేసీఆర్ నీచ రాజకీయాలను నిరసిస్తూ తెలంగాణ జన సమితి కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాసంఘాలు, ప్రజా స్వామికవాదులు రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.


రెడ్డిబస్తీలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ స్వర్ణలతారెడ్డి


నివాళులర్పిస్తున్న కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి


నాగోలు చౌరస్తాలో .. కార్పొరేటర్ చింతల అరుణ

గాంధీ చూపిన మార్గంలో పయనిద్దాం

వాడవాడలా బాపూజీకి ఘన నివాళి

సైదాబాద్: జాతిపిత మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. మలక్‌పేట, ఎల్బీనగర్ జోన్ల పరిధిలో మంగళవారం బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు.

- సైదాబాద్ డివిజన్ రెడ్డిబస్తీలోని మహాత్ముడి విగ్రహానికి స్వర్ణలతారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పగిళ్ల శ్రీనివాస రెడ్డి, లక్ష్మణ్ ఠాకూర్, జ్యోతి, పరమేష్, మధు, హరి, నవీన్, భాస్కర్ నివాళులర్పించారు.
- దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలో గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దగోని వెంకటేష్ గౌడ్ తదితరులు నివాళులర్పించారు.
- వాసవి కాలనీలోని ఆధ్యాత్మిక కేంద్రంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్ర శేఖర్ గుప్తా, కార్యదర్శి అయిత అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య, కృష్ణ మూర్తి, చిలుక ఉపేందర్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.
- చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు చౌకి రవికుమార్, రాజేందర్ యాదవ్, నర్సింగ్‌రావు, మహ్మద్ గౌసుద్దీన్, విజయలక్ష్మి గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.
- నాగోల్ : చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్ర నాథ్ యాదవ్, బీజేపీ నాయకులు సిద్దాల ఐలయ్య, వస్పారి మల్లేష్, కొండ బత్తుల శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, అమర్ నివాళులర్పించారు.
- నాగోలు చౌరస్తాలో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ టీసీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పార్టీ అధ్యక్షురాలు మంజులారెడ్డి, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, పుల్లయ్య, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్లెం నరసింహారెడ్డి పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు


వాసవి కాలనీలో.. పెండ్యాల నగేష్, అరవింద్ తదితరులు


నివాళులర్పిస్తున్న వాసవి కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

నేడు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

లింగోజిగూడ: సరూర్‌నగర్ చెరువు సమీపంలో ఉన్న గ్రీన్ పార్క్ కాలనీ, తపోవన్ కాలనీల్లో దోమలు విజృంభిస్తున్నాయని, నివారణ కోసం బుధవారం ఉదయం 7 గంటల నుంచి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపడతామని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ సిబ్బంది, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు కూడా పాల్గొనాలని కోరారు. చెరువు చుట్టూ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు దోమలు ఉత్పత్తి కాకుండా మందు చల్లుతామని అన్నారు.

డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

చాదర్‌ఘాట్: రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డైరీని మంగళవారం రాష్ట్ర మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఎస్.నర్సింహాచారి మలక్‌పేటలోని వికలాంగుల కార్యాలయంలో మాట్లాడుతూ, డైరీని ఆవిష్కరించిన మంత్రికి శాఖలోని సమస్యలపై తాము వినతి పత్రం ఇవ్వగా, సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.వెంకట రాములు, శేఖర్, రవీందర్, యాదుల్లా పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మన్సూరాబాద్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌ను కోరారు. హయత్‌నగర్ పరిధిలోని సీఎస్ఆర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా లెవల్స్ పాటించి, పనులను త్వరిగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు సత్తిపండు, గోపాల్‌రెడ్డి, లింగయ్య, శ్రీనివాస్, రవీందర్, నాయకులు శ్రీధర్‌గౌడ్, జయతేజ, కడారి యాదగిరియాదవ్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మలక్‌పేట: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ అయిన అమీర్ అలీఖాన్‌ను మంగళవారం మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ అక్బర్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో ఆయను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.


అమీర్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న షేక్ అక్బర్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

ప్రొఫెసర్ కోదండరాం

చైతన్యపురి: రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం చైతన్యపురి సాయినగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ సేవా సమితి భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో డైరీ, కేలండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, గత ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టులను నిర్మించిందని ఆరోపించారు. ప్రతి శాఖలో జీఓల పేరుతో ఉద్యోగాలను తొలగించారన్నారు. ప్రమోషన్లు ఇవ్వకపోవటం, కొత్త నియామకాలు చేపట్టక పోవటం బాధాకరం అన్నారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్, కోశాధికారి ప్రసాదరావు, సభ్యులు మదన్‌మోహన్ రావు, కృష్ణమూర్తి, బాల్‌రాములు, ఓం ప్రకాష్, సంజీవరెడ్డి, మోహన్ సింగ్, రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణకు కృషి చేద్దాం


అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ అరుణ సురేంద్రనాథ్ యాదవ్

నాగోలు: కుష్ఠు వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్‌లోని సాయి నగర్ రోడ్ నం.6లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్ఠు వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ మాట్లాడుతూ, కుష్ఠు లెప్రె అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, వ్యాధి ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుందని అన్నారు. కుష్ఠు వ్యాధి చాలా నెమ్మదిగా పెరిగి, వ్యాధి లక్షణాలు బహిర్గతం కావటానికి సగటున 3 నుంచి 5 ఏళ్లు పడుతుందన్నారు. చర్మంపై ఏ రకమైన మచ్చలు ఉన్నా దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దాల ఐలయ్య, వస్పారి మల్లేష్, కొండ బత్తుల శ్రీనివాస్, నరేంధర్ రెడ్డి, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి: సీఐటీయూ

మన్సూరాబాద్: ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర మోహన్, ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డిలు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం ఆటోనగర్‌లోని పారిశ్రామిక వాడలో కార్మికులతో సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతతత్వ విధానాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కోరారు. భారత్ వెలిగిపోతుంది, అచ్చేదిన్ ఆయేగా, విశ్వగురువు, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా లాంటి మోసపూరిత నినాదాలతో ఏమీ ఒరగలేదన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సయ్యద్, లింగం, చంద్రశేఖర్, లక్ష్మయ్య, నర్సింహ, లింగస్వామి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్ కలెక్టర్‌పై దాడి

నిందితుల్లో ఎంఐఎం కార్పొరేటర్ వర్గీయులు

చంచల్‌గూడ: పాతబస్తీలో విద్యుత్ బకాయిలు వసూలు చేసే సిబ్బందిపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయి. దీంతో పాతబస్తీలో ఉద్యోగం చేయడానికి సిబ్బంది వణికిపోతున్నారు. తాజాగా మంగళవారం మాదన్నపేట పీఎస్ పరిధిలో స్థానిక ఎంఐఎం కార్పొరేటర్ మహపార ఇంటి విద్యుత్ బకాయిలు వసూలు చేసేందుకు వెళ్లిన బిల్ కలెక్టర్ రజనీష్‌పై ఆమె సోదరులతో పాటు మరికొందరు భౌతిక దాడికి దిగారు. దీంతో బాధితుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కార్పొరేటర్ ఇద్దరు సోదరులతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని దిగువ తెలిపిన ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

- ఉదయం 9 నుంచి 11 గంటల వరకు...
  ఎంసీహెచ్ కాలనీ, రేస్‌కోర్స్ రోడ్, లైబ్రరీ పీటీ, వాణి స్కూల్, డబీర్‌పురా మెయిన్‌రోడ్, యాసీన్ జంగ్ పరిసర ప్రాంతాలు
- ఉ .11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...
  జమాల్ కాలనీ, ఫకీర్‌గల్లీ, పోచమ్మ టెంపుల్, సిటీపల్స్, ధర్మావంత్ కాలేజ్, గంగానగర్ నాలా, చతీసా మైదాన్, యాకుత్ మహల్ థియేటర్, సిల్కీ ఐస్‌క్రీం పరిసర ప్రాంతాలు.
- ఉ. 10 నుంచి మ.12 గంటల వరకు...
  మోతీ మసీద్, నాలా, బడా మందిర్ పరిసర ప్రాంతాలు
- మ. 2 నుంచి సా. 3 గంటల వరకు...
  అగ్రికల్చర్ ఆఫీస్, ఒవైసీ గ్రౌండ్, అంబేద్కర్ నగర్, హ్యాపీహోమ్స్ పరిసర ప్రాంతాలు
- మ 3 నుంచి సా. 5 గంటల వరకు...
  హది అమీన్ మసీద్, మూన్లీ స్కూల్, సీఐటీ క్వార్టర్స్, ఓల్డ్‌మలక్‌పేట వాటర్ ట్యాంక్, జియా ఉల్ కా మసీద్, అబుబకర్ మసీద్, వాహెద్ నగర్ జెండా పీటీ, ఓల్డ్ మస్తాన్ గట్టీ, వాహెద్‌నగర్ ఏటూజెడ్, అలఫ్లా మసీద్, న్యూ వాహెద్‌నగర్ పరిసర ప్రాంతాలు.

ప్రధాన సమస్యలు పరిష్కరిస్తా..

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో నూతనంగా నిర్మించే రోడ్డు పనులను ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో హస్తినాపురంలో సమస్యలు లేకుండా చేస్తానని, జీహెచ్ఎంసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ కానీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రజల భాగస్వామ్యంతో పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, స్వామిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బస్వారెడ్డి, రామకష్టారెడ్డి, డేరింగుల కృష్ణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్, జానకీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

సైదాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు ప్రాధాన్యమివ్వాలని ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని గిరిజన సమాఖ్య కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు బస్తీవాసులతో నిర్వహించిన పౌరహక్కుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ మహమూద్ మాట్లాడుతూ, సింగరేణి కాలనీ గుడిసెవాసుల పట్టాల సమస్య, డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సైదాబాద్ ఎస్ఐ అమర్‌నాథ్, సైదాబాద్ మండల ఆర్ఐ మధు, సివిల్ సప్లై అధికారి అలీ, సీపీఐ నాయకులు దశరథ్ నాయక్, అంజయ్య, అమీనా పాల్గొన్నారు.

మార్చిలో వేదాంత జ్ఞాన సభలు




నాగోలు: 98వ శ్రీ సనతన వేదాంత జ్ఞాన సభలు మార్చి 25, 26, 27 తేదీలలో నగరంలోని ఎస్‌పీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు శ్రీ వ్యాసాశ్రమ గురు పరంపర స్వామి తెలిపారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ మంగళవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శ్రీవ్యాసాశ్రమ గురు పరంపర స్వాములకు ఘన స్వాగతం పలికి పూలమాలలతో సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. నగరంలో జరిగే సనాతన వేదాంత జ్ఞాన సభలను విజయవంతం చేయాలని స్వామిజీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దయాకర్ గుప్తా, పాండు గుప్తా, సారపు లక్ష్మణ్ గుప్తా, ప్రకాష్ గుప్తా, శివ కుమార్ గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ స్టేట్ విభాగం నాయకులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైయిన్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి

నాగోలు: కొత్తపేట డివిజన్ గాయత్రి పురంలోని ఎస్‌ఆర్‌ఎస్ కాలనీ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న బాక్స్ డ్రెయిన్ పనులు త్వరిత గతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. ఎస్‌ఆర్‌ఎస్ కాలనీలో బాక్స్ డ్రెయిన్ పనులను మధ్యలో నిలిపివేయడంతో కాలనీల్లోకి వెళ్లే వాహనదారులు, పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం కార్పొరేటర్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సంబంధిత అధికారులు ఈఈ శ్రీనివాస్, ఏఈ మాత్య నాయక్ కార్పొరేటర్‌తో కలిసి డ్రెయిన్ పనులను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జేసీబీతో రోడ్డుపై మట్టిని తొలగిస్తామని, డ్రెయిన్ పనులు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామ్ నాథ్, విజయ్ భాస్కర్, నారాయణ, సంగ్రామ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని హత్య చేసి.. మృతదేహాన్ని కాల్చేశారు

- హయత్‌నగర్‌లో వెలుగు చూసిన ఘాతుకం


మృతుడు నర్సయ్య (ఫైల్)

హయత్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. దుండగులు అతడిని చంపి గుర్తు పట్టకుండా మృతదేహాన్ని కాల్చేశారు. స్థానికంగా కలకలం రేపిన ఈ ఘటన మంగళవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది, పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం జిల్లాకు చెందిన నందిపాటి నర్సయ్య(55) మునగనూరు బ్యాంక్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పని చేస్తూ భార్య, కూతురితో కలిసి అక్కడే ఉంటున్నాడు. సోమవారం భార్య మరోచోటికి పనికి వెళ్లగా నర్సయ్య ఇంటి వద్దే ఉన్నాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన భార్యకు నర్సయ్య కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన భార్య చుట్టు పక్కల వెతికింది. మద్యం తాగి అప్పుడప్పుడు ఇంటికి రాకుండా ఉండే అలవాటు ఉండటంతో ఉదయం వస్తాడు అనుకుని భార్య సరిపెట్టుకుంది. కాగా, సమీపంలోని హయత్‌నగర్ శ్మశాన వాటిక సమీపంలోని ఓ నిర్జన ప్రదేశంలో కాలిన స్థితిలో ఓ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వివరాలు సేకరించే పనిలో భాగంగా పోలీసులు ఆ మృతదేహాన్ని నర్సయ్య భార్యకు చూపించగా తన భర్తదిగా గుర్తించింది. దుండగులు అతడిని చంపి ముఖం, ఛాతీ భాగంపై చెత్త వేసి కాల్చినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు. నర్సయ్యను ఎవరు.... ఎందుకు చంపారు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించిన పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీస్తున్నారు.